క్లుప్తంగా

పాఠశాల గ్రంథాలయానికి పుస్తకాల విరాళం



గ్రంథాలయానికి పుస్తకాలు అందజేస్తున్న దాత అఖిల్

కామవరపుకోట: మండలంలో రావికింపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రంథాలయానికి రాజమహేంద్రవరానికి చెందిన చార్టెడ్ అకౌంట్ చలంచర్ల అఖిల్ రూ.15 వేలు విలువ గల తెలుగు సాహిత్యం, సైన్స్, విజ్ఞానం, గణితం, కథలు, జీవిత చరిత్రలు, వ్యాసాల పుస్తకాలను శుక్రవారం ప్రధానోపాధ్యాయులు ఉమ్మడి భీమరాజుకు ఉపాధ్యాయులు బిరుదు గద్ద నాగేశ్వరరావు ద్వారా అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం



కళ్లజోడు అందిస్తున్న దృశ్యం

కామవరపుకోట: స్థానిక కొత్తూరు మదర్ థెరిస్సా యూత్ ఆధ్వర్యంలో మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా శుక్రవారం 150 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, కళ్లజోళ్లు అందజేశారు. అవసరమైన వారికి కంటి శస్త్రచికిత్సలు చేయనున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కరిపోతూ అనూష, ఆర్‌సీఎం ఫాదర్ గోగు పీటర్ ప్రసాద్, సీఎస్ఐ పాస్టర్ కుచ్చులపాటి ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రయాన్ విజయోత్సవ ర్యాలీ



కొయ్యలగూడెంలో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలుపుతున్న విద్యార్థులు

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం, పరింపూడిలలో ప్రభుత్వ బాలుర, బాలికల హైస్కూల్స్ విద్యార్థులు, సిద్ధార్థ స్కూల్ విద్యార్థులు శుక్రవారం చంద్రయాన్–3 విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. త్రివర్ణ పతాకాలను చేతబూని భారత్ మాతాకీ జై, జయహో భారత్ అంటూ నినదించారు. మానవహారంగా ఏర్పడి శాస్త్రవేత్తలకు సంఘీభావం ప్రకటించారు. శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు.

జూదరుల అరెస్ట్

జంగారెడ్డిగూడెం: స్థానిక బాటగంగానమ్మ లేఅవుట్ కాలనీ వద్ద పొలాల్లో శుక్రవారం పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. రూ.70,200 నగదు, 16 మోటార్‌సైకిళ్లు, 13 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ పి.రాజేష్ చెప్పారు. సీఐ ఆధ్వర్యంలో సిబ్బందితో ఈ దాడులు నిర్వహించారు.

సోమరాజుకు అభినందనలు

గణపవరం: వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా కార్యదర్శిగా ఉంగుటూరు నియోజకవర్గం గణపవరానికి చెందిన నడింపల్లి సోమరాజు నియమితులవడంపై పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈయన ఈ పదవికి ఎంపిక కావడం వరుసగా ఇది మూడోసారి. గురువారం ఏలూరు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఆళ్లనాని ప్రకటించిన జిల్లా కమిటీలో సోమరాజును జిల్లా కార్యదర్శిగా నియమించారు. గతంలో ఆళ్లనాని, పుప్పాల వాసుబాబు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా పనిచేసిన కాలంలో సోమరాజు జిల్లా పార్టీ కార్యదర్శిగా పనిచేశారు. గతంలో గణపవరం మండల పార్టీ అధ్యక్షుడిగా పనిచేశారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ వచ్చే సాధారణ ఎన్నికలలో పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకురావడానికి ఎమ్మెల్యే వాసుబాబు సారథ్యంలో శక్తివంచన లేకుండా కృషి చేస్తాన ని తెలిపారు. సోమరాజు నియామకంపై ఎమ్మె ల్యే పుప్పాల వాసుబాబు, రాష్ట్ర సూర్యబలిజ కార్పొరేషన్ చైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు వేంద్ర వెంకటస్వామి, గణపవరం ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసీ సభ్యురాలు దేవారపు సోమలక్ష్మి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండు రాము తదితరులు అభినందనలు తెలిపారు.

వ్యాయామ విద్యకు ఉజ్వల భవిష్యత్తు

దెందులూరు: వ్యాయామ విద్యకు ఉజ్వల భవిష్యత్తు కచ్చితమైన ఉద్యోగ భద్రత ఉందని బుట్టాయగూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీ. మహేంద్రరావు అన్నారు. శుక్రవారం వ్యాయామ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నత్తానియేలు అధ్యక్షతన వ్యాయామ విద్య, ప్రాధాన్యత అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపల్ మహేంద్రరావు మాట్లాడుతూ శిక్షణ సమయంలో విద్యార్థులు క్రమశిక్షణతో ఎంచుకున్న లక్ష్యాలు అధిగమించేందుకు కృషి చేయాలన్నారు. అధ్యాపకులు ఆర్.సతీష్, భవాని, ప్రసాద్ ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వత్రాలు

- విశేష అలంకరణల్లో అమ్మవార్ల దర్శనం
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

జంగారెడ్డిగూడెం: శ్రావణ మాసం రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం పర్వదినం సందర్భంగా అమ్మవార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవార్లకు విశేష అభిషేకాలు, ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్లు విశేష అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఇళ్ల వద్ద మహిళలు వేకువ జామునే నిద్రలేచి అమ్మవారికి పూజలు చేశారు. అమ్మవారికి పలు రకాల పిండి వంటకాలతో నైవేద్యాలు సమర్పించుకున్నారు. జంగారెడ్డిగూడెం నూకాలమ్మ సన్నిధిలో శుక్రవారం పూజల అనంతరం ఆలయ కళ్యాణ వేదిక వద్ద ప్రధానార్చకులు యర్రమిల్లి మనోజ్ శర్మ నేతృత్వంలో మహిళలు వ్రతం ఆచరించారు. మున్సిపల్ కమిషనర్ భవానీప్రసాద్, కడలి సత్యనారయణ, ఆమని దంపతులు, (కుకునూరు) మహిళలు వ్రత పూజల్లో పాల్గొన్నారు. చింతా నాగరాజు దంపతులు ప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు శ్రీ నూకాంబిక సేవా బృందం సభ్యులు ప్రసాద వితరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈనెల 30న బుధవారం సాయంత్రం 54వ చండీహోమం లోక కళ్యాణార్థం ఆలయ కమిటీ చైర్మన్ రాజాన సత్యనారాయణ (పండు) తెలిపారు. వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు లక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. జంగారెడ్డిగూడెం పాత ఆంధ్రాబ్యాంకు వీధిలోని విజయదుర్గమ్మవారిని ఆలయాన్ని రూ.10 లక్షల నగదుతో అలంకరించారు. శ్రీకాకుళపు నాగయ్య గుప్త దంపతులు ప్రసాద వితరణ చేశారు.



ప్రత్యేక అలంకరణలో నూకాలమ్మవారు



లక్ష్మీదేవిగా జంగారెడ్డిగూడెం వాసవీ కన్యకా పరమేశ్వరి



కుక్కునూరు శివాలయంలోని మహాలక్ష్మమ్మ



కొయ్యలగూడెంలో గజలక్ష్మి అలంకరణలో కనకదుర్గమ్మ



బొర్రంపాలెంలో గ్రామ దేవతలను దర్శించుకుంటున్న భక్తులు

మహాలక్ష్మమ్మ ఊరేగించారు

కుక్కునూరు : కుక్కునూరు శివాలయంలో అమ్మవారికి అష్టోత్తర శాతనామావళి పూజ, సాయంత్రం కుంకుమ పూజలు చేశారు. మండల కేంద్రంలో గ్రామస్తులు మహాలక్ష్మమ్మవారి విగ్రహాన్ని తలపై పెట్టుకొని మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. మహిళలు ఇళ్లల్లో వరలక్ష్మి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు.

గజలక్ష్మిగా కనకదుర్గమ్మ

కొయ్యలగూడెం: స్థానిక శ్రీచక్ర సహిత కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు గజలక్ష్మి అలంకరణతో పూజలు అందుకున్నారు. అర్చకులు సామూహిక కుంకుమ పూజలు చేయించారు. కన్నాపురం, గవరవరం, బయ్యనగూడెం, వై.జంక్షన్, రాజవరం, గ్రామాల్లోని కనకదుర్గమ్మ ఆలయాలతో పాటు గ్రామదేవతల ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. కొయ్యలగూడెంలో గ్రామదేవత చింతాలమ్మవారు విశేష అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు.

పిండి వంటకాలతో నైవేద్యాలు

టి.నరసాపురం : మండలంలోని టి.నరసాపురం, బొర్రంపాలెం, మక్కినవారిగూడెం గ్రామాల్లో ఆలయాల్లో అమ్మవార్లను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కుంకుమ పూజలు, వరలక్ష్మి వ్రతాలు ఆచరించారు. ఇళ్ల వద్ద మహిళలు వేకువ జామునే లేచి అమ్మవారికి పూజలు చేశారు. అమ్మవారికి పలు రకాల పిండి వంటకాలతో నైవేద్యాలు సమర్పించుకున్నారు.

శాకాంబరిగా కుంకుళ్లమ్మ

ద్వారకాతిరుమల: క్షేత్ర దేవత కుంకుళ్లమ్మ అమ్మవారు ఫల, కూరగాయల అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. డ్రాగన్ ఫ్రూట్స్, ఆపిల్, దానిమ్మ, బత్తాయి, పైనాపిల్ వంటి ఫలాలు, క్యారెట్, బంగాళ దుంప, క్యాప్సికం, వంకాయ, ఆనప, బీర వంటి కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు. ఆలయాన్ని సైతం శోభాయమానంగా తీర్చిదిద్దారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి, తరించారు. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు మహిళా భక్తులతో ఆలయం సందడిగా మారింది. శాకాంబరిగా ఉన్న అమ్మవారిని దర్శిస్తే సకల సౌభాగ్యాలు, శుభాలు కలుగుతాయని పండితులు తెలిపారు.

నేరాల అదుపునకు ప్రత్యేక దృష్టి



చింతలపూడి పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ

చింతలపూడి: పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలో నేరాల అదుపునకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్టు జంగారెడ్డిగూడెం డీఎస్పీ ధనుంజయుడు అన్నారు. శుక్రవారం ఆయన చింతలపూడి పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. సీఐ, ఎస్సైలను స్టేషన్‌లో నమోదవుతోన్న కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చింతలపూడి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశామన్నారు. శాంతిభద్రతలు, సివిల్ తగాదాలు, రౌటీషీట్, ఎన్‌డీపీఎస్ రికార్డుల పరిశీలించామని చెప్పారు. ఈ స్టేషన్ పరిధిలో ఎక్కువగా భూ సమస్యలకు సంబంధించిన కేసులు రిజిస్టర్ అవుతున్నాయన్నారు. ఈ కేసులు ఎక్కువగా చింతలపూడి మండలం ప్రగడవరం, వెంకటాపురం, సీతానగరం తదితర గ్రామాల్లో నమోదు అవుతున్నట్టు తెలిపారు. వీటిపై సీఐ, తహసీల్దార్ కృష్ణజ్యోతితో చర్చించామన్నారు. భూ సమస్యలు నమోదయ్యే ప్రాంతంలో 145 సీఆర్‌పీసీ అమలు చేసి, ఇరువర్గాలను సంబంధిత భూమిలోకి అనుమతించకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. మండలంలో అక్రమ మద్యం, జూదక్రీడలు తదితర నేరాలు కూడా గుర్తించామని, వీటిని అరికట్టేందుకు కఠిన చర్యలు అమలు చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో సీఐ ఎంవీఎస్ మల్లేశ్వరరావు, ఎస్సై కె.ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

'గడపగడపకు' కార్యక్రమంతో గ్రామాల్లో మార్పు



పోతునూరులో మహిళలకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో గ్రామాల్లో స్పష్టమైన మార్పు కనిపిస్తోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రజలు ఇబ్బందులను ప్రత్యక్షంగా తెలుసుకుని వాటిని పరిష్కరించడంతోపాటు, అర్హులకు పథకాలు అందించేందుకు, అభివృద్ధి పనులను సమీక్షించేందుకు ఈకార్యక్రమం దోహదపడుతోందని ఆయన అన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి అన్నారు. శుక్రవారం రాత్రి పోతునూరులో దెందులూరు ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, సర్పంచ్ బోదుల స్వరూప్, సొసైటీ అధ్యక్షుడు డీఎన్‌వీ ప్రసాద్ (బజ్జి), పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొఠారు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజాప్రతినిధులు, అధికారులను ప్రజలకు వద్దకు పంపించి సమస్యలు పరిష్కరింపజేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, రేషన్ డీలర్ల జిల్లా అధ్యక్షులు తలారి రామకృష్ణ, పార్టీ నాయకులు రమేష్, బీశెట్టి నూకరాజు, రమేష్, బుద్ధా అర్జున, పెనుగంటి అప్పారావు, మల్లా సత్తిపండు, పిల్లా శ్రీనివాస్, వలంటీర్లు, గృహ సారథులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు ఉన్నారు.

నేడు సత్యవోలులో..

పెదపాడు: మండలంలోని సత్యవోలు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించనున్నట్టు బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, మండల కన్వీనర్ అప్పన ప్రసాద్ తెలిపారు. సత్యవోలులో మధ్యాహ్నం 3గంటల నుంచి రాత్రి 9గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ముఖ్య అతిథిగా పాల్గొంటారని చెప్పారు.

మద్దుల కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

దెందులూరు: వైఎస్సార్ సీపీ నాయకులు మద్దుల వినోద్ ఆకస్మిక మరణం తనను కలిచివేసిందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. వినోద్‌ను ఆస్పత్రికి వెళ్లి పరామర్శించానని, సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి తిరిగి వస్తారని భావించనన్నారు. వినోద్ మృతికి ఎమ్మెల్యే సంతాపం తెలిపారు. ఎమ్మెల్యే కొఠారుతోపాటు ఎంపీటీసీ సున్నా నరేష్ , వినోద్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



ప్రగడవరంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

చింతలపూడి: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోన్న వైఎస్సార్ సంపూర్ణ పోషణను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కృష్ణ జ్యోతి సూచించారు. చింతలపూడి మండలం ప్రగడవరం–2 సచివాలయం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె శుక్రవారం తనిఖీ చేశారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగంగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ కిట్లు పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. అనంతరం వెలగలపల్లి, విద్యాధరపల్లి, ఫాతిమాపురం, శ్రీరామపురం, ముక్కంపాడు అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. బరువు, ఎదుగుదల తక్కువగా ఉన్న పిల్లలు, రక్తహీనత ఉన్న గర్భిణుల ఇళ్లను సందర్శించి పౌష్టికాహారం తీసుకోవాల్సిన ఆవశ్యకతను తహసీల్దార్ వివరించారు. కార్యక్రమంలో ఆర్ఐ కాంతామణి, ప్రగడవరం–2 ఏఎన్ఎం, సచివాలయం కార్యదర్శి తదతరులు పాల్గొన్నారు.

ప్రజలకు సక్రమంగా పథకాలు అందజేయాలి



ప్రగతిని సమీక్షిస్తున్న డీఆర్‌డీఏ పీడీ విజయరాజు

భీమడోలు: గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు సమర్థవంతంగా పథకాలు అందించాల్సిన బాధ్యత సంబంధిత ఉద్యోగులదేనని మండల ప్రత్యేకాధికారి, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు అన్నారు. పోలసానిపల్లిలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు శుక్రవారం ఆయన ఆకస్మిక సందర్శన చేసారు. సచివాలయాల వద్ద ప్రజలకు అందే పథకాలు, కార్యక్రమాల నిర్వహణ, వాటి ప్రగతి, లోపాలపై ఆయన సంబంధిత సిబ్బందితో ఆయన సమీక్షించారు. ప్రధానంగా ఐదేళ్ల లోపు చిన్నారుల్లోను, గర్భిణీలు, బాలింతల్లో రక్తహీనత లోపాలు గుర్తించినందున వాటిని అధిగమించేందుకు ప్రత్యేక కార్యచరణను చేపట్టే కార్యక్రమంలో భాగంగా ఏఎన్ఎం, అంగన్‌వాడీ, వెల్ఫేర్ అసిస్టెంట్, ఇంజనీరింగ్, హౌసింగ్ తదితర అంశాలపై వాటి ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలు రక్తహీనత, బరువు తక్కువగా ఉన్నవారు ఆరుగురిని గుర్తించారు.వారికి పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. పోలసానిపల్లిలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ లేనందున అభివృద్ధి పనులు మందకొడిగా సాగుతున్నాయని, వెంటనే ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ను నియమించాలని సంబంధిత పీఆర్ డీఈ శ్రీనివాస్‌ను ఆదేశించారు. సచివాలయాల్లోని సేవలన్నీ ప్రజలకు సత్వరమే అందించాలని, లేని పక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలోని 21 ఏళ్ల లోపు గల డ్రాపవుట్స్‌ను ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో చేర్పించాలని, నూరుశాతం ఎన్‌రోల్ చేయాల్సిన బాధ్యత వెల్ఫేర్ అసిస్టెంట్లపై ఉందన్నారు. అర్హులందరికీ పింఛన్లు అందుతాయన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం తగు శ్రద్ధ వహించాలని కోరారు. హౌసింగ్ ఏఈ సతీష్, ఏపీఎం సురేష్, సూపర్‌వైజర్ షాహనాజ్‌బేగం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫైర్‌సేఫ్టీ నిబంధనలకు తూట్లు

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో అత్యంత బిజీగా ఉండే ఆర్‌ఆర్‌పేట ప్రాంతంలో షాపింగ్ మాల్స్, వస్త్ర దుకాణాలు నిబంధనలు గాలికి వదిలేసి ఇష్టారాజ్యంగా భవనాలు నిర్మించారు. నిత్యం వందలాది మంది కస్టమర్లు షాపింగ్ మాల్స్‌లో వస్తుంటారు. ఐతే వినియోగదారుల ప్రాణాలకు ఏమాత్రం విలువ ఇవ్వకుండా భవన నిర్మాణాలు చేయటం చర్చనీయాంశంగా మారింది. కనీసం అగ్నిమాపక నిబంధనలు సైతం పాటించకుండా భారీ భవనాలు నిర్మించటం, అనుమతులు మంజూరుపై అధికారులు ఆరా తీస్తున్నారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ సింగలూరి వెంకటేశ్వరరావు, డీఈ శ్రీనివాసన్, ఏఈ టి.శ్రీనివాసరావు, టౌన్‌ప్లానింగ్ అధికారి మల్లేశ్వరరావు, సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నారు. కొలతలు వేసి మరీ నిబంధనలు పాటించలేదని నిర్ధారించారు.

టౌన్‌ప్లానింగ్ నిర్లక్ష్యం

ఏలూరు ఆర్‌ఆర్‌పేటలో ఓ వస్త్రదుకాణం భారీ భవనంలో ఏర్పాటు చేశారు. ఈ భవన నిర్మాణంలో యాజమాన్యం నిబంధనలు గాలికి వదిలేసినట్లు విజిలెన్స్ తనిఖీల్లో తేలింది. అగ్నిమాపక శాఖ నుంచి అనుమతులు పొందకుండానే భవన నిర్మాణం చేపట్టారు. రోడ్డు నుంచి 20 మీటర్లు దూరం ఉన్నప్పటికీ ఫైర్‌సేఫ్టీ నిబంధనలు పాటించలేదని అధికారులు చెబుతున్నారు. ఏలూరు టౌన్‌ప్లానింగ్ అనుమతులకు విరుద్ధంగా పైన మరో అంతస్తు నిర్మించినట్టు తనిఖీల్లో తేలింది. టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే భవన నిర్మాణాల్లో అక్రమాలు, అవినీతి చోటుచేసుకుంటుందని ఆరోపించారు. ఇదే సెంటర్‌లోని మరో కాంప్లెక్స్‌లోనూ నిబంధనలు పాటించలేదని అధికారులు చెబుతున్నారు.

విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం



గుండుగొలనులో సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

భీమడోలు: భవిష్యత్తులో విద్యుత్ సమస్య తలెత్తకుండా నాణ్యమైన కరెంట్‌ను ప్రజలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. భీమడోలులో రూ.3.50కోట్ల వ్యయంతో నిర్మించిన 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. హర్షధ్వానాల నడుమ స్విచ్చాన్ చేసి సబ్‌స్టేషన్‌ను ప్రారంభించి జాతికి అంకితం చేసారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి విద్యుత్ శాఖ ఎస్ఈ సాల్మన్‌రాజు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు మాట్లాడుతూ ఈ సబ్‌స్టేషన్ నిర్మాణంతో ఈ ప్రాంతవాసుల చిరకాల వాంఛ తీరనుందన్నారు. ప్రజల అవసరాల రీత్యా విద్యుత్ వినియోగం గణనీయంగా పెరగడంతో అధిక లోడు వల్ల తరచూ విద్యుత్ అంతరాయాలు ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వాటిన్నింటికీ చెక్ పెట్టేందుకు అవసరమైన చోట్ల సబ్ స్టేషన్ల నిర్మాణం, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. గుండుగొలను సబ్‌స్టేషన్ వల్ల 10వేల గృహ నిర్మాణ వినియోగదారులకు, పరిశ్రమలకు హెచ్చుతగ్గులు లేని నాణ్యమైన కరెంట్‌ను అందిస్తామన్నారు. గుండుగొలను, వడ్డిగూడెం, భోగాపురం, రత్నాపురం, కోరుకల్లు, పెదలింగంపాడులోని ప్రజలకు విద్యుత్ సమస్య పూర్తి స్థాయిలో తీరుతుందన్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలోని జగనన్న కాలనీల్లో కోట్లాది రూపాయలతో నూరుశాతం కొత్తగా విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయడం, ఇంటింటికీ విద్యుత్ సదుపాయాలను కల్పించారన్నారు. నిడమర్రు, గుండుగొలనులో సబ్‌స్టేషన్లలో ఏర్పాటు చేయగా అవసరమైనట్లయితే 5 ఎంవీలను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలోని గణపవరం, కేశవరం, రాచూరి, తోకలపల్లి, రాచూరు గ్రామాల్లో సబ్‌స్టేషన్ నిర్మాణాలకు అవసరమైన స్థలాల సేకరణ జరిగిందని, పూర్తి స్థాయి అనుమతులు రాగానే వాటిని నిర్మిస్తామన్నారు. నిడమర్రు, గణపవరం మండలాల్లో రైతులు, ఆక్వా రైతులు ఎక్కువగా ఉన్నందున గణపవరంలలో రూ.120 కోట్లతో 132 సబ్‌స్టేషన్ నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు. విద్యుత్ శాఖ ఎస్ఈ పి.సాల్మన్‌రాజుతో పాటు వారి బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. అనతి కాలంలోనే సబ్‌స్టేషన్‌ను నిర్మించి ప్రజలకు కరెంట్ అవసరాలను తీర్చారన్నారు. ఏఈ రాళ్లపల్లి భీమేశ్వరరావు ఈ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ప్రధాన భూమికను పోషించారన్నారు. ఎస్ఈ పి.సాల్మన్‌రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూ.400 కోట్లతో ఆర్‌డీసీసీ వంటి సాంకేతిక పరిజ్ఞానంతో లో ఓల్టేజి సమస్యకు శాశ్వతంగా పరిష్కరించేందుకు అన్ని చర్యలు చేపట్టిందన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

జంగారెడ్డిగూడెం: స్థానిక వార్డు సచివాలయాల పరిధిలో వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్న మున్సిపల్ కమిషనర్ పి.భవానీప్రసాద్ శుక్రవారం తెలిపారు. బీసీ ఉమెన్–1, ఎస్సీ ఉమెన్–1, ఎస్టీ ఉమెన్–1, ఓసీ–2 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తి ఉన్న వారు ఆన్‌లైన్‌లో ఈ నెల 27లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. 29న ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక, సెప్టెంబర్ 1 నుంచి విధులకు హాజరుకావాల్సి ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

5న ఆలయ ఉద్యోగులకు వైద్య శిబిరం

ద్వారకాతిరుమల: శ్రీవారి దేవస్థానం అధికారులు, సిబ్బంది కుటుంబాలకు వైద్య సేవలు అందించే నిమిత్తం వచ్చేనెల 5న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు ఆలయ ప్రథమ చికిత్సా కేంద్రం వైద్యుడు రాజేంద్రప్రసాద్ తెలిపారు. దేవస్థానం చైర్మన్ ఎస్వీ సుధాకరరావు, ఈఓ వేంద్ర త్రినాథరావుల ఆధ్వర్యంలో ఏలూరు ఆయుష్ హాస్పిటల్ వారు వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. స్వామివారి నిత్య కల్యాణ మండపం క్రింద భాగంలో ఉన్న హరిణి కల్యాణ మండపంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని, ఉద్యోగులు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని రాజేంద్రప్రసాద్ కోరారు.

అన్నదానం

కొయ్యలగూడెం: కల్పవృక్ష రోటరీ క్లబ్ వృద్ధ ఆశ్రమంలో శుక్రవారం అన్నదానం చేశారు. శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ దివంగత ధర్మకర్త గంగిరెడ్ల శ్రీనివాస్ జయంతిని పురస్కరించుకొని ఆయన కుటుంబీకులు అన్నదానం చేశారు. కొయ్యలగూడెంలో రిక్షా పుల్లర్స్‌కి, హమాలీలకు యాచకులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. గద్ద రామలక్ష్మి సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ చిక్కాల దుర్గాప్రసాద్ పార్టీ నాయకులు మాజేటి సత్యనారాయణ, మారిశెట్టి శ్రీను, చిటికెన నాగార్జున, ఎస్‌కే బాజీ, కండెల్లి శివ, ఆశ్రమ నిర్వాహకులు మాజేటి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ద్వారకాతిరుమల: కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న వ్యక్తిని శుక్రవారం సాయంత్రం పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో వాహన తనిఖీ చేస్తుండగా అశ్వారావుపేట నుంచి కోళ్ల వ్యర్థాలను వాహనంలో తరలిస్తుండగా భీమడోలు మండలం చెట్టున్నపాడు గ్రామానికి చెందిన బలే వాసు అనే వ్యక్తికి అరెస్ట్ చేశామని ఎస్సై టి.సుధీర్ తెలిపారు.

నేడు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పెదపాడు: పెదపాడు మండలంలోని గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి శనివారం శంకుస్థాపన చేయనున్నట్లు పెదపాడు మండల కన్వీనర్ అప్పన ప్రసాద్ తెలిపారు. శనివారం ఉదయం 9.30గంటలకు రూ.3కోట్ల వ్యయంతో పెదపాడు మండలంలోని కొత్తూరు–వీరమ్మకుంట–పెదపాడు ఆర్‌అండ్‌బీ రహదారి నిర్మాణం, ఉదయం 10.45 గంటలకు వీరమ్మకుంటలో రూ.50లక్షల వ్యయంతో పైపు లైను నిర్మాణం, అనంతరం జిల్లా పరిషత్ నిధులతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేసి ప్రజల నుద్దేశించి ప్రసంగిస్తారని చెప్పారు. మధ్యాహ్నం 3గంటల నుంచి పెదపాడు–గుడిపాడు– వడ్డిగూడెం రహదారిని అభివృద్ధికి రూ.4కోట్ల వ్యయంతో శంకుస్థాపనలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి

దెందులూరు: వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబరుగా పోకల రాంబాబును నియమిస్తూ ఏలూరు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ఏలూరు ఎమ్మెల్యే ఆళ్లనాని శుక్రవారం లిఖితపూర్వక ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం దెందులూరులో జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబరుగా నియమితులైన పోకల రాంబాబు మాట్లాడుతూ తనను పార్టీ జిల్లా కమిటీ మెంబరుగా నియమించడానికి పూర్తి సహాయసహకారాలు అందించిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నానికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని పోకల రాంబాబు అన్నారు.